సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



అంత్యక్రియలకు వెళ్లొస్తూ..
అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో దంపతులు మృతి చెందారు. - 8లో



బాగుపడ్డ గిరిజన బతుకులు
తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గిరిజనుల బతుకులు బాగుపడ్డాయని గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. - 9లో



నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా
మునుగోడు నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యారోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

వలిగొండ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వైద్యసిబ్బందిని ఆదేశించారు. వలిగొండలోని 2వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించి పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోతి, సర్పంచ్ బోళ్ల లలిత శ్రీనివాస్, ఎంపీఓ కేదారీశ్వరర్, హెల్త్ సూపర్‌వైజర్ సువర్ణ కుమారి, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు. అనంతరం మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవ చేపట్టారు. అదే విధంగా ప్రధానాలయంలో నిత్య కైంకర్యాలు కొనసాగాయి.

అభ్యంతరాలు తెలియజేయాలి

సాక్షి, యాదాద్రి : నల్లగొండ జిల్లాలోని అమ్మనబోలును నూతన మండలంగా ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అనుగుణంగా జిల్లా గెజిట్‌లో నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని సూరారం, బి.తుర్కపల్లి, కుంకుడుపాముల గ్రామాలు అమ్మనబోలు మండల పరిధిలోకి చేర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సూచనలు, అభ్యంతరాలను 15 రోజుల్లో తెలియజేయాలని సూచించారు.

ఐటీఐల్లో 5వ విడత అడ్మిషన్‌లు

భువనగిరి, భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ, శివసాయి ఐటీఐల్లో ఐదవ విడత అడ్మిషన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కట్ట మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాస్, ఇంటర్, డిగ్రీలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఐటీఐలో చేరడానికి అర్హులన్నారు. ఈనెల 10వ తేదీ వరకు అడ్మిషన్‌లు కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 9182401477, 98482 28052, 9848571409 నంబర్లను సంప్రదించాలన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మిషన్ భగీరథ కార్మికులు

భువనగిరిటౌన్ : మిషన్ భగీరథ కార్మికుల కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శుక్రవారం కొనసాగింది. దీక్షలో భాగంగా కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. రాత్రివేళల్లో పని చేస్తున్న తమకు ప్రభుత్వం టార్చిలైట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. విధి నిర్వహణలో అవసరమైన పరికరాలు సమకూర్చాలని, నెలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఉగ్గి బాలరాజు, నాయకులు చంద్ర మౌళి, మైసయ్య, రవి, మహేష్ , శ్రీకాంత్, సుక్క రాజు, వెంకటేష్, రాజు, మహేష్, యాదగిరి, ప్రవీణ్, రాములు సంపత్ కుమార్ రాజు,కర్ణకార్,ప్రశాంత్ సంతోష్ కొండల్ అశోక్,భాస్కర్ ,మహేందర్, జంగయ్య, సురేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మోత్కుపల్లి?

బెంగళూరులో డీకేతో చర్చలు
- తుంగతుర్తి టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి
- సానుకూలత వ్యక్తం చేసిన శివకుమార్
- వచ్చే నెలలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో హస్తం గూటికి మోత్కుపల్లి నర్సింహులు



బెంగళూరులో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను కలిసిన మోత్కుపల్లి నర్సింహులు

సాక్షి, యాదాద్రి : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. అసెంబ్లీ టికెట్ ఇస్తానని తనకు హామీ ఇచ్చిన కేసీఆర్.. ఆరు నెలలుగా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడంతో హస్తం గూటికి చేరాలని డిసైడ్ అయ్యారు. శుక్రవారం ఆయన బెంగళూరులో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. తుంగతుర్తి టికెట్ ఇవ్వాలని కోరగా అందుకు డీకే సానుకూలత వ్యక్తం చేయడంతో వచ్చే నెలలో కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

ఏ పదవి దక్కకపోవడం వల్లే..
రానున్న ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడో ఒక చోట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని మోత్కుపల్లి నర్సింహులు తన అభిప్రాయాన్ని పలుమార్లు వెల్లడించారు. అయితే సీఎం కేసీఆర్ సిట్టింగులకే సీట్లు కేటాయించడంతో ఆ అవకాశం లేకుండాపోయింది. కాగా బీఆర్ఎస్ పార్టీలో ఉన్న మోత్కుపల్లి.. కేసీఆర్‌ను నేరుగా కలిసి మాట్లాడాలని ఆరు నెలలుగా ప్రయత్నిస్తున్నా అవకాశం ఇవ్వడంలేదని ఆయన మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. హుజురాబాద్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం తీసుకువచ్చిన దళితబంధు పథకం చైర్మన్ లేదా ఎమ్మెల్సీ, రాజ్యసభ ఏదో ఒక పదవి దక్కుతుందన్న ఆశతో ఉన్న మోత్కుపల్లికి ఏ అవకాశం కేసీఆర్ కల్పించలేదు.

తుంగతుర్తి నుంచి పోటీకి సంసిద్ధత
ఉమ్మడి జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న మోత్కుపల్లి వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నుంచి అసెంబ్లీకి పోటీ చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల నియోజకవర్గంతో పాటు పలు చోట్ల మీడియా సమావేశాల్లో మోత్కుపల్లి అనుచరులు ప్రకటించారు. అయితే బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించినా సిట్టింగ్ కోటాలో తుంగతుర్తి నుంచి గాదరి కిషోర్‌కుమార్‌కు మూడవ సారి టికెట్ లభించింది. ఆలేరులో ఐదు సార్లు (టీడీపీ, ఇండిపెండెంట్, కాంగ్రెస్), తుంగతుర్తి నుంచి టీడీపీ తరఫున ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో కాంగ్రెస్ నుంచి ఆలేరు ఎమ్మెల్యేగా గెలిచిన మోత్కుపల్లి అనంతరం టీడీపీలో చేరారు.అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో మరోసారి కాంగ్రెస్ నుంచి తుంగతుర్తిలో పోటీకి సిద్ధం అవుతున్నారు.

ఖర్గే సమక్షంలో చేరికకు ఏర్పాట్లు
ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు కాంగ్రెస్ నాయకుడొకరు చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో సహా జిల్లాలోని ముఖ్యనేతలంతా కొంత కాలంగా మోత్కుపల్లితో టచ్‌లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి జిల్లాలో పార్టీకి సీనియర్ నేతగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర నేతల సూచన మేరకు బెంగళూరులో డీకే శివకుమార్‌ను కలిశారు. మాజీ ఉప ముఖ్య మంత్రి దామోదర రాజనర్సింహ హైదారాబాద్‌లోని మోత్కుపల్లి ఇంటికి వచ్చి సుదీర్ఘంగా చర్చించడంతోపాటు కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అలాగే జిల్లాలో సీనియర్ నేత మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు మోత్కుపల్లిని పార్టీలోకి రావాలని కోరినట్లు సమచారం. అయితే ఉమ్మడి జిల్లాలో పేరున్న మోత్కుపల్లి కాంగ్రెస్‌లో చేరిక బీఆర్ఎస్‌కు నష్టమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



రామన్నపేటలో ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, చిత్రంలో ఎంపీ బడుగుల, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ వీరన్న

- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కేసీఆర్ మళ్లీ రావాలి
- అభివృద్ధి కోసం పరితపించే వ్యక్తి ఎమ్మెల్యే చిరుమర్తి
- వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- రామన్నపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

రామన్నపేట : అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ కేసీఆర్‌ను ఆశీర్వదించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం రామన్నపేటలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డితో కలిసి రూ 5.70 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ ఆస్పత్రి భవనం, రూ 2.50 కోట్లతో చేపట్టే శ్రీ చెన్నకేశవ ఆలయ పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అదే విధంగా రూ.25 లక్షలతో ఆధునీకరించిన ఉపకోశాధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో మంత్రి మాట్లాడారు. ఇంటింటికీ భగీరథ నీళ్లు, గడపగడపకూ సంక్షేమ పథకాలు, ప్రతి ఎకరాకు సాగునీరు, వ్యవసాయానికి కోతలు లేకుండా 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 24 లక్షల మందికి పింఛన్లు ఇస్తే కేసీఆర్ సర్కార్ 44 లక్షల మందికి ఇస్తుందని వివరించారు. తమ పాలనలో వ్యవసాయానికి దొంగలుపడే రాత్రి కరంట్ ఇచ్చి, ఇళ్లకు కోతలు, పరిశ్రమలకు పవర్‌హాలిడేలు ప్రకటించిన కాంగ్రెసోళ్లకు కరంట్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. పదేపదే ఉచిత కరెంట్ గురించి మాట్లాడే ఇక్కడి ఎంపీ వేలుపెట్టి చూస్తే పవర్ వస్తుందో లేదో తెలుస్తుందని హితవు పలికారు. తెలంగాణలో గెలవలేమని తేలిపోవడంతో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెడుతుందన్నారు. అభివృద్ధి కోసం పరితపించే వ్యక్తి చిరుమర్తి లింగయ్య అని, మూడోసారి గెలిపించుకోవాలని కోరారు.

పనిచేసే ఎమ్మెల్యేలకు చిరునామా చిరుమర్తి : మంత్రి జగదీష్‌రెడ్డి
అభివృద్ధిలో ఆరు దశాబ్దాలుగా వెనుకబడిన నకిరేకల్ నియోజకవర్గం.. అనతికాలంలో రూపురేఖలే మారిపోయాయని మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. ప్రజలు, తన ప్రాంత అభివృద్ధి కోసమే పనిచేసే ఎమ్మెల్యేలకు చిరుమర్తి చిరునామాగా నిలుస్తారని కొనియాడారు. హైదరాబాద్ వస్తే ఉట్టి చేతులతో తిరిగి రాడని, నియోజకవర్గం కోసం ఏదో ఒకటి చేసుకొని వస్తుంటారని పేర్కొన్నారు. 24 గంటలకు బదులు 48 గంటలు పనిచేసే ఎమ్మెల్యేను మళ్లీ గెలిపిస్తే ఇంకా అభివృద్ధి చేస్తాడని, పనిచేసే ప్రభుత్వంలో ఉండేలా చిరుమర్తిని గెలిపించాలని కోరారు.

కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష : ఎమ్మెల్యే చిరుమర్తి
కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. అభివృద్ధికి నోచుకోని రామన్నపేటలో నాలుగేళ్లలో రూ.30కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ అన్నికోణాల్లో ఆలోచించి తనను అభ్యర్థిగా ప్రకటించారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించి మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్, ఫిషరీష్ డెవలప్‌మెంట్ చైర్మన్‌లు రామకృష్ణారెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి డీసీపీ రాజేష్‌చంద్ర, ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్, డీసీహెచ్ఎస్ చిన్నానాయక్, ఎస్టీఓ పురుషోత్తంరెడ్డి, సూపరింటెండెంట్ వీరన్న, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, జెడ్పీటీసీ పున్న లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ గోదాసు శిరీష, ఎంపీటీసీలు గొరిగె నర్సింహ, వనం హర్షిణి, మార్కెట్ చైర్మన్లు పైళ్ల రాజ్యవర్ధన్‌రెడ్డి, జడల ఆదిమల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్లు నంద్యాల భిక్షం రెడ్డి, రుద్రారపు భిక్షం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, కార్యదర్శి మల్లేశం, మార్కెట్ వైస్ చైర్మన్ కమ్మంపాటి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి ఉపసర్పంచ్ పాడిచేటి కిషన్, పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ..



అయిటిపాముల వద్ద లిఫ్టుకు శంకుస్థాపన చేస్తున్న హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి, చిరుమర్తి

- నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల రిజర్వాయర్ సమీపంలో రూ.101.62 కోట్లతో నిర్మించనున్న లిఫ్టు ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేశారు.
- నకిరేకల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన. ఎస్టీఓ, గ్రంథాలయ భవనాలను ప్రారంభించారు.
- సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో లక్ష్మీ రాఘవరావ్ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అలాగే స్థానిక వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డు ఎదుట ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన విద్యాసాగర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- తుంగతుర్తిలో రూ.45.45కోట్లతో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.4కోట్లతో నాలుగులేన్ల మెయిన్ రోడ్డు విస్తరణ, రూ.2.8కోట్లతో తుంగతుర్తి శివారులో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



రామన్నపేటలో జరిగిన బహిరంగసభకు హాజరైన జనం

బీఆర్ఎస్ పాలనలోనే బీసీలకు పెద్దపీట



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : బీఆర్ఎస్ పాలనలోనే బీసీలకు ప్రాధాన్యం లభిస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలోని ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని బీసీ, ఎంబీసీ కుల వృత్తిదారులకు బీసీబంధు కింద లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కుల వృత్తిదారుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారిని అక్కున చేర్చుకుంటుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల వృత్తిదారుల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునే బాధ్యత ప్రతి బీసీ బిడ్డపై ఉందన్నారు. ఈ సందర్భంగా 300 మందికి బీసీబంధు చెక్కులు అందజేశారు. వీరితో పాటు మైనార్టీలకు కూడా ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, ఎంపీపీలు నరాల నిర్మల, సుధాకర్‌గౌడ్, నూతి రమేష్, మున్సిపల్ చైర్మన్లు అంజనేయులు, విజయలక్ష్మి, జెడ్పీటీసీలు బీరు మల్లయ్య, గోలి ప్రణతి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు ఎడ్ల రాజేందర్‌రెడ్డి, పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమ్మకు కష్టాలు!



ప్రసూతి సేవలు నిలిచిపోవడంతో ఆస్పత్రి నుంచి తిరిగి వెళ్తున్న గర్భిణులు

- ఆలేరు సీహెచ్‌సీలో ప్రసూతి సేవలు బంద్
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న గర్భిణులు

ఆలేరురూరల్ : ఎనిమిది మండలాల ప్రజలకు ప్రధాన కేంద్రంగా ఉన్న ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రెండు వారాలుగా ప్రసూతి సేవలు నిలిచిపోయాయి. ఆస్పత్రిలో సగటున నెలకు 30 కాన్పులు చేయాలనే నిబంధన ఉంది. కానీ, ఆపరేషన్ థియేటర్ సౌకర్యంగా లేదన్న కారణంతో ప్రసూతి సేవలను నిలిపివేశారు. దీంతో కాన్పుకోసం వచ్చిన గర్భిణులు తిరిగివెళ్తున్నారు. సీహెచ్‌లో ప్రసూతి సేవలు నిలిపివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేద కుటుంబాలకు చెందిన మహిళలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి వేల రూపాయలు నష్టపోతున్నారని, సీహెచ్‌సీలో తక్షణే ప్రసూతి సేవలు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

డాక్టర్ ఏమంటున్నారంటే..
ఆపరేషన్ థియేటర్ సౌలభ్యంగా లేదు. గోడల పెచ్చులూడుతున్నాయి. ఆపరేషన్‌లు చేయొద్దని జిల్లా వైద్యాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో గర్భిణులను తిరిగి పంపుతున్నామని సీహెచ్‌సీ డాక్టర్ నిఖిల తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రాజాపేట : ఎన్నికల్లో లబ్ధిపొందడానికి కాంగ్రెస్, బీజేపీలు అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పిస్తున్నాయని, ప్రజలు నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. శుక్రవారం రాజాపేట మండలంలోని చల్లూరు, రేణిగుంట, నర్సాపురం, జాలా, సింగారం, కొండ్రెడ్డిచెరువు, పుట్టగూడెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కార్ అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. నిరుద్యోగుల కోసం టీ హబ్‌లు ఏర్పాటు చేస్తుందని, పరిశ్రమలకు ఏర్పాటుకు పెట్టుబడి సహాయం చేస్తుందన్నారు. మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా.. మూడు పంటలకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చే కేసీఆర్ ప్రభుత్వం కావాలా ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్‌లో కొందరు మహిళలు గ్రామానికి బస్సు కావాలని, దళితబంధు, గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీపీ బాలమణి, జెడ్పీటీసీ గోపాల్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్లు వెంకట్రామిరెడ్డి, గాల్ రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : 108 అంబులెన్స్‌ల్లో ఈఎంటీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ మంద శ్రీనివాస్ తెలిపారు. డిప్లొమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ(బైపీసీ), ఎస్ఎస్‌సీ, ఏఎన్ఎం పూర్తి చేసి 30 ఏళ్ల లోపు వయస్సున్న వారు అర్హులన్నారు. అసక్తి కలిగిన వారు ఈ నెల 30న జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఒర్జినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9985226582 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చండి

- పూర్తిస్థాయిలో డ్రెయినేజీలు లేవు
- ఓపెన్ ప్లాట్‌ల ద్వారా దోమలు వృద్ధి చెందుతున్నాయి
- నివారణకు ఫాగింగ్ చేయాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో గుట్ట పట్టణవాసులు
- సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ హామీ

యాదగిరిగుట్ట : పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. డ్రెయినేజీలు సరిగా లేవు. మురుగు నీరు, వర్షపు నీరు ఇళ్ల మధ్య, వీధుల్లో చేరుతోంది. ఓపెన్ ప్లాట్‌లలోనూ నీళ్లు చేరి దోమలు, పందులకు ఆవాసాలుగా మారాయి.. విషజ్వరాలు ప్రబలుతున్నందున అపరిశుభ్రత ప్రాంతాల్లో ఫాగింగ్ చేయడం, బ్లీచింగ్ చల్లడం, డ్రెయినేజీల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు చేపట్టాలని యాదగిరిగుట్ట పట్టణవాసులు కోరారు. మున్సిపాలిటీలో డ్రెయినేజీలు, చెత్త సేకరణ, దోమల బెడద తదితర సమస్యలపై శుక్రవారం సాక్షి నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ప్రజలు తమ సమస్యలు ఏకరువుపెట్టారు. మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ సమస్యలను నోట్ చేసుకొని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు, కమిషనర్ సమాధానం వారి మాటల్లో..

ప్రశ్న : డ్రెయినేజీ కోసం ఏడాది క్రితం పైప్‌లైన్ వేశారు. నేటికీ పనులు పూర్తి కాలేదు.
-యాదగిరిస్వామి, పాతగుట్ట
కమిషనర్ : వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తాం.

ప్రశ్న : మా వార్డులో పందుల బెడద ఎక్కువగా ఉంది. -సావిత్రి, 7వ వార్డు
కమిషనర్: పెంపకదారులతో సమావేశం ఏర్పాటు చేసి పందులను తరలించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : మా కాలనీలో నీళ్లు సరిగా రావడం లేదు. నీటి సరఫరా వేళలను ప్రకటించాలి.
-కోకల పాండు, 9వ వార్డు
కమిషనర్ : భగీరథ నీళ్లు రానప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏ ఏరియాలో ఎప్పుడు నీళ్లొస్తాయో సమయ వేళలు ప్రకటిస్తాం.

ప్రశ్న : లోటస్ టెంపుల్ సమీపంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పైప్‌లైన్ పగిలిపోయింది. అధికారులు పట్టించుకోవడం లేదు.
- జితేందర్‌రెడ్డి, లోటస్ టెంపుల్
కమిషనర్ : పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తాం



ఫోన్‌లో ప్రజల నుంచి సమస్యలు వింటూ రాసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ప్రశ్న : వేసిన చోటే మళ్లీ సీసీ రోడ్లు వేస్తున్నారు. దీంతో నిధులు వృథా అవుతున్నాయి. లేని ప్రాంతాల్లో రోడ్లు వేయాలి.
- బొజ్జ సాంబేష్, కొత్త గుండ్లపల్లి
కమిషనర్: రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లోనే కొత్తగా సీసీ వేస్తున్నాం. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.30 కోట్లు వచ్చాయి. పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మిస్తాం.

ప్రశ్న : మా ఇంటి వెనకాల అరెకరం స్థలంలో మురుగు నీరు చేరి కుంటలా మారింది. రోగాల భారిన పడుతున్నాం. - సతీష్, పాతగుట్ట
కమిషనర్: సంబంధిత ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : కొత్త గుండ్లపల్లిలో 2–1 నుంచి 2–10 ఇంటి వరకు డ్రెయినేజీ లేదు.
-బొజ్జ కృష్ణ, కొత్త గుండ్లపల్లి
కమిషనర్ : డ్రెయినేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తాం.

ప్రశ్న : డ్రెయినేజీలు సరిగా లేవు. మురుగునీరు నిలిచిన చోట బ్లీచింగ్ చల్లడం లేదు.
-సుదుగు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాంనగర్
కమిషనర్ : డ్రెయినేజీల నిర్మాణంపై మున్సిపల్ చైర్‌పర్సన్‌తో మాట్లాడుతా. మురుగు నీరు నిలిచిన చోట బ్లీచింగ్ చల్లిస్తాం.

ప్రశ్న : చెక్ పోస్టు ఏరియాలో 3 నెలలుగా నీళ్లు వస్త లేవు. ట్యాంకర్ కూడా రోజు తప్పించి రోజు వస్తుంది. సమస్య తీవ్రంగా ఉంది.
-శాగంటి శ్రీనివాస్, చెక్‌పోస్టు ఏరియా
కమిషనర్ : నీళ్లు ఎందుకు రావడంలేదో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : మా ఇంటి ఎదుట ఉన్న ఓపెన్ ప్లాట్‌లో స్థానికులు చెత్త వేస్తున్నారు. దీంతో పందులు సంచారం పెరిగింది. - లక్ష్మణ్, 5వ వార్డు
కమిషనర్ : డోజర్ ఏర్పాటు చేసి ఓపెన్ ప్లాట్‌లలో చెత్తను తొలగిస్తాం.

ప్రశ్న : నల్లపోచమ్మవాడలో వైన్స్ ఉంది. మద్యం తాగి ఇళ్ల పక్కనే మూత్రవిసర్జన చేస్తుండడంతో దుర్వాసన వస్తుంది. బయటకు వెళ్లలేక పోతున్నాం.
- సరస్వతి, నల్లపోచమ్మవాడ
కమిషనర్ : వైన్స్ నిర్వాహకులకు నోటీసులు పంపిస్తాం. ఎక్సైజ్ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తాం.

ప్రశ్న : డ్రెయినేజీలను క్లీన్ చేయడం లేదు. ఫాగింగ్ మిషన్ తిప్పడం లేదు. మున్సిపాలిటీలో లేకుంటే స్వచ్ఛంధ సంస్థల ద్వారా కొనుగోలు చేయించి ఇస్తాం.
-బెలిదే అశోక్, వైకుంఠద్వారం ఏరియా
కమిషనర్ : డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం. ఫాగింగ్ మిషన్‌లు ఉన్నాయి. రోజూ రెండు, మూడు వార్డుల్లో తిప్పుతున్నాం.

క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత సహకార సంచాలకులు విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని భువనగిరి చేనేత సహకార పారిశ్రామిక సంఘం భవనంలో సంఘం 70వ వార్షిక, 63వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సంఘం 2022–23 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ నివేదికను ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు. అనంతరం భువనగిరి చేనేత పారిశ్రామిక ఉత్పత్తి , విక్రయ సంఘం అధ్యక్షుడు గర్దాసు బాలయ్య మాట్లాడారు. సంఘం అభివృద్ధి కోసం సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బడుగు సత్యనారాయణ, ఎస్ కిషన్, సంఘం కార్యదర్శి ఎలగందుల కరుణాకర్, నర్సింహ్మ, అందె కృష్ణ, కస్తూరి శ్రీనివాస్, తీరందాసు బాలయ్య, భద్రమ్మ, సుదర్శన్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, నాయకులు

యాదగిరిగుట్ట: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మంగ నర్సింహులు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం ఆశా వర్కర్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దకందుకూర్ సర్పంచ్ బీమగాని రాములు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బబ్బూరి పోశెట్టి, మండల కమిటీ సభ్యులు కాళే స్వామి, ఎండీ లతీఫ్, ఆశావర్కర్లు అండాలు, మంద మంజులా, బలం శోభ, సావిత్రి, దొంత మంజులా, జ్యోతి, లలితా, సుజాత పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

బీబీనగర్: మండలంలోని పడమటిసోమారం గ్రామంలో శ్రీ లింగ బస్వేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపును నిర్వహించారు. 6లక్షల 9వేల 957రుపాయాల ఆదాయం వచ్చినట్లు భువనగిరి డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమతి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ గణేష్‌యాదవ్, ఆయల సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

చౌటుప్పల్: మండల పరిధిలోని ధర్మోజిగూడెం, లక్కారం, లింగోజిగూడెం, చౌటుప్పల్, కొయ్యలగూడెం గ్రామాల్లోని బెల్టుషాపులపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 8 బెల్టుషాపుల్లో రూ.70వేల మద్యం బాటిళ్లను పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ దేవేందర్ తెలిపారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తెలంగాణలో బాగుపడ్డ గిరిజన బతుకులు

- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- కొండమల్లేపల్లి, దేవరకొండ, దామరచర్ల మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు


దేవరకొండ: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

దేవరకొండ, కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గిరిజన బతుకులు బాగుపడ్డాయని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె దేవరకొండ నియోజకవర్గంలో రూ.126 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో ఒకప్పుడు ఆడ శిశువులను అమ్ముకునే దుస్థితి ఉండేదని, ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నేడు గిరిజనుల బతుకులు మారాయని అన్నారు. తెలంగాణలోని మూడు వేలకుపైగా తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణలో ఆరు శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచి గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత కేవలం సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి 24 గంటల ఉచిత విద్యుత్‌పై గతంలో అనుచిత వ్యాఖ్యలు చేశారని, అసలు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం పట్ల అవగాహన ఉండి మాట్లాడాడా... లేక మాట్లాడాడా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలను పొందుతున్నారని, రాబోయే ఎన్నికల్లో తప్పకుండా బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి సీఎం కేసీఆర్‌ను మూడవసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కొండమల్లేపల్లిలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవనం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థినుల మధ్యలో కూర్చొని ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేవరకొండలోని బంజార భవనం పనులు పూర్తి చేసేందుకు రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా కొండమల్లేపల్లిలో బంజార భవన్ నిర్మాణానికి రూ.50 లక్షలు, నియోజకవర్గంలోని మరో మూడు రోడ్లకు సంబంధించి నిధులు మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహాడ్, కేశ్యతండాలకు చెందిన పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్, ఆర్‌వి.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, ట్రికార్ చైర్మన్ రాంచంద్రనాయక్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీరాములు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాబనాయక్, ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, మాధవరం సునితాజనార్దన్‌రావు, పద్మహన్మానాయక్, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఇలా..

దేవరకొండ మండలం కొమ్మేపల్లిలో నిర్మించిన గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల భవనం ప్రారంభించి అదనపు గదులకు శంకుస్థాపన చేశారు. పెంచికల్‌పహాడ్‌లో వైటీసీ భవనాన్ని ప్రారంభించి పట్టణంలోని సాయి బాబా దేవాలయం వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కొండమల్లేపల్లి మండలంలోని కేశ్యతండాలో కేశ్యతండా నుంచి నాంపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు వయా కొత్తబావి, హంక్యతండా వరకు చేపడుతున్న బీటీ రోడ్డు పనులకు, గుర్రపుతండా గ్రామపంచాయతీ పరిధిలోని పన్నితండాలో సాగర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పన్నితండా వరకు రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులకు, అంతకుముందు దేవత్‌పల్లి గేటు వద్ద గల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో రూ.5 కోట్లతో చేపడుతున్న బాలికల అదనపు కళాశాల భవనం, రూ.2.70 కోట్లతో చేపడుతున్న బాలికల హాస్టల్ నిర్మాణ పనులకు, రూ.4.20 కోట్లతో చేపడుతున్న భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం


మిర్యాలగూడ : బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

మిర్యాలగూడ : రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని గాంధీనగర్ నుంచి కల్లేపల్లి వరకు బీటీ రోడ్డు, రూ.4.20 కోట్లతో దామరచర్ల మండల కేంద్రంలో నిర్మించనున్న గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు ఆమె ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణంతోపాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న వారికి ఇతర రాష్ట్రాల్లో కంటే అధిక వేతనం ఇస్తున్నామని తెలిపారు. అంతకుముందు ఆమె కల్లేపల్లి గ్రామంలో వెలసిన బంగారు మైసమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాసులు, ఆర్డీఓ చెన్నయ్య, మార్కెట్ చైర్మన్ బుచ్చయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటి రెడ్డి, జెడ్పీటీసీ ఆంగోతు లలితహాతిరాం నాయక్, ఎంపీపీ నందినిరవితేజ, ఎంపీటీసీ పాచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి నుంచే విశ్వరూప విజయ యాత్ర

- మైసూరు శ్రీదత్త విజయానందతీర్థ స్వామిజీ


ఆలయంలో ప్రవచనాలు చేస్తున్న విజయానందతీర్థ స్వామిజీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం మైసూర్ దత్త విజయానందతీర్థ స్వామిజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యాదాద్రీశుడి సన్నిధిలోని శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో చతుర్మాస దీక్షను ముగించారు. అనంతరం యాదాద్రి కొండపైన స్వయంభూలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామిజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లోక కల్యాణార్థం విశ్వరూప విజయయాత్రను యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం నుంచి ప్రారంభిస్తున్నట్లు స్వామిజీ తెలిపారు. యాదాద్రి ఆలయ శిల్పకళా సౌందర్యం అద్భుతంగా ఉందన్నారు. చాలా తక్కువ సమయంలో ఇలాంటి నిర్మాణం చేపట్టిన ప్రభుత్వానికి, ఇంజనీర్లు, శిల్పులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ప్రవచించారు. స్వామిజీ వెంట ఈఓ గీతారెడ్డి, చీఫ్ ఆర్కిటెక్ట్ మధుసూదన్, ఆలయాధికారులు, అర్చకులు ఉన్నారు.

ప్లాట్లను కబ్జా చేశారని ఆందోళన


నిరసన తెలుపుతున్న బాధితులు

బీబీనగర్: మండలంలోని నెమురగోముల గ్రామ రెవెన్యూ పరిధిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనయుడు అనురాగ్ తమ ప్లాట్లను కబ్జా చేశారని ఆరోపిస్తూ సాయిబాబా నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాట్ల యాజమానులు శుక్రవారం స్థానికంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వెంచర్‌లోని 16 ఎకరాల్లో 284 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని, కానీ అధికార పార్టీని అడ్డం పెట్టుకొని అనురాగ్‌తోపాటు, బడా బాబులు 2005లో ఫేక్ డ్యాక్‌మెంట్లు సృష్టించి 156 ప్లాట్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. వీటిని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ వెంకటేశ్వర్లు, సభ్యులు శివయ్య, బడెసాబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

రాజాపేట: ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ ఘటన రాజాపేట మండలంలోని జాల గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. జాల గ్రామానికి చెందిన మునిగంటి ఉమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేటల జిల్లా గజ్వేల్ మండలంలోని ఆర్వీఎం ఆస్పత్రికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో రాజాపేట మండంలోని జాల గ్రామ శివారులోకి రాగానే కారులో మంటలు రావడంతో గమనించిన ఉమేష్ తన భార్య భార్గవి, కుమారుడితో కలిసి వెంటనే కారు దిగి దూరంగా పరిగెత్తారు. వెంటనే మంటలు పెద్దవై కారు పూర్తిగా దగ్ధమైంది. రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్‌రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

కారు అద్దం ధ్వంసం.

మోత్కూరు: పట్టణంలోని భువనగిరి రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట పార్కింగ్ చేసిన కారు అద్దంను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ఆరవ సునీల్‌కుమార్ కారులో శుక్రవారం మోత్కూరుకు వచ్చి తన మిత్రుడు సైమన్‌తో కలిసి భువనగిరి రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోకి వెళ్లారు. బ్యాంకు ఎదుట పార్కింగ్ చేసిన సునీల్‌కుమార్ కారు వెనుక భాగంలోని కుడి వైపు అద్దంను గుర్తుతెలియని ధ్వంసం చేశారు. సునీల్‌కుమార్ బయటకు వచ్చి చేసేసరికి కారు అద్దం పగిలి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ నర్సింహనాయుడు పరిశీలించారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

మోత్కూరు: అప్పుల బాధతో పాటు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగిబావి గ్రామానికి చెందిన జినుకల అయిలయ్య(52)కు భార్య పద్మ, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తె వివాహం అయ్యింది. అయిలయ్య తనకున్న రెండెకరాల భూమిలో వరి పంట వేశాడు. మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. కుమార్తె పెళ్లితో పాటు పంట పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. అప్పు విషయమై తండ్రీకొడుకుల మధ్య గురువారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అయిలయ్య శుక్రవారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి అయిలయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్న అయిలయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఇస్లాం శాంతిని బోధిస్తుంది: ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరిటౌన్: ఇస్లాం శాంతిని బోధిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని భువనగిరి పట్టణంలోని జలీల్‌పుర మజీద్‌లో ఏర్పాటు చేసిన ఈద్ మిలాద్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో మీనానగర్‌లో ఉన్న పాత గ్రంథాలయాన్ని ముస్లిం కమ్యూనిటీ హాల్‌కు కేటాయించినట్లు చెప్పారు. నూతన ఈద్గా నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ అమరేందర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శాంతి సందేశం ప్రపంచ మానవాళికి ఆదర్శం

భువనగిరిటౌన్: మహ్మద్ ప్రవక్త అందించిన శాంతి సందేశం ప్రపంచ మానవాళికి ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరిలోని జలీల్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా పట్టణంలో మదర్సాకు రూ. 1.50లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నజీమాసలావుద్దీన్, నాయకులు సోమయ్య, వనిత, శ్రీకాంత్, వెల్లంకి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేయడం తగదు

భువనగిరి క్రైం: ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకి హైకోర్టు జరిమానా విధించిందనే విషయం వాస్తవం కాదని ఆమె తరపు న్యాయవాది ఎంఏ రహీం అన్నారు. విప్ సునీతకు హైకోర్టు రూ.10వేల జరిమానా విధించిందని ప్రసార మాధ్యమాల్లో కథనాలు రావడంతో ఆమె తరపున వాదిస్తున్న న్యాయవాది ఎంఏ రహీం శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గొంగిడి సునీత తన ఆస్తులు వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుగా చూపెట్టారని సాయిని సతీష్‌కుమార్ 2019లో హైకోర్టులో కేసు వేశాడని అన్నారు. ఆ తర్వాతి కాలంలో సతీష్‌కుమార్ చనిపోగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన బోరెడ్డి అయోధ్యరెడ్డి అదే కేసులో ఇంప్లిమెంట్ అయ్యి హైకోర్టు రూ.10వేల జరిమానా విధించారని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని అన్నారు. తన క్లయింట్ గొంగిడి సునీత తన ఆస్తుల వివరాలను గజంతో సహా ఎన్నికల కమిషన్‌కు సమర్పించారని చెప్పారు. ఆమెపై తప్పుడు ప్రచారం చేస్తున్న బోరెడ్డి అయోధ్యరెడ్డిపై కోర్ట్ ఆఫ్ కంటెమ్ట్‌తో పాటుగా పరువు నష్టం దావా కూడా వేస్తున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వలిగొండ: కర్రతో కోతులను తరుముతుండగా కరెంట్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం. తుర్కపల్లి గ్రామానికి చెందిన మద్రి రోశయ్య(43) శుక్రవారం ఉదయం ఇంటి వద్ద కర్రతో కోతులను తరుముతుండగా.. ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు కర్రకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్తొస్తూ అనంతలోకాలకు..

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- దంపతులతో పాటు వారి కుమార్తె దుర్మరణం
- మరో ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలు
- ఖమ్మం జిల్లాలోని తల్లంపాడు వద్ద ఘటన
- మృతుల స్వస్థలం మునగాల మండలం వెంకట్రాంపురం ఆవాసం ఎస్ఎంపేట గ్రామం


సంతోష్‌కుమార్ (ఫైల్)


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి


ఆస్పత్రిలో ఝాన్సీ మృతదేహం


మునగాల(కోదాడ): అంత్యక్రియలకు హాజరై వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో దంపతులతో పాటు వారి కుమార్తె మృతిచెందారు. శుక్రవారం ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద ఈ ప్రమాదంలో మరో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుల స్వస్థలం మునగాల మండలంలోని వెంకట్రాంపురం గ్రామ పంచాయతీ ఆవాసం ఎస్ఎంపేట గ్రామం. వివరాలు.. ఎస్ఎంపేట గ్రామానికి చెందిన మందపెల్లి రామారావు, లక్ష్మయ్య అన్నదమ్ములు. రామారావు మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. రామారావు కుమారుడు ఆస్ట్రేలియాలో ఉండడంతో అతడు వచ్చాక శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా లక్ష్మయ్య కుమారులు సంతోష్‌కుమార్, అరుణ్‌కుమార్ గత ఏడాది కాలంగా ఖమ్మం పట్టణంలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తమ పెద్దనాన్న అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రెండు కార్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఎస్ఎంపేటకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో సంతోష్‌కుమార్‌తో పాటు భార్య ఝాన్సీరాణి, వారి ఇద్దరు కుమార్తెలు, అతడి తమ్ముడు(అరుణ్‌కుమార్) పిల్లలు ఇద్దరు కలిసి ఒక కారులో వెళ్తున్నారు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారు ఖమ్మం జిల్లాలోని తల్లంపాడు వద్ద సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మందపల్లి సంతోష్‌కుమార్(38) అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య ఝాన్సీరాణి(35)కి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం పట్టణంలోని మమత హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని ఖమ్మం పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఇందులో సంతోష్‌కుమార్ పెద్ద కుమార్తె యోజిత(16) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం శనివారం మృతదేహాలను ఎస్ఎంపేటకు తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు.

గణనాథుడికి పూల అలంకరణ



భువనగిరి: భువనగిరి పట్టణంలోని ఆర్బీనగర్ పార్కు సమీపంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వీర హనుమాన్ వినాయక విగ్రహం పూలతో ఆకట్టుకునేలా అలంకరించారు. ఈ విగ్రహాన్ని శుక్రవారం రాత్రి నిమజ్జనం చేశారు.

రాహుల్ గాంధీని కలిసిన వేముల వీరేశం


కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఢిల్లీలో శుక్రవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మర్యాద పూర్వకంగా కలిశారు.

మంత్రుల పర్యటనలో..


రామన్నపేట: చెన్నకేశవ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


తుంగతుర్తిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి


నకిరేకల్‌లో డిగ్రీ కళాశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే


తుంగతుర్తి సభకు వస్తున్న మంత్రులకు పూలు చల్లి స్వాగతం పలుకుతున్న ప్రజలు


నకిరేకల్ సభలో మంత్రి హరీశ్‌రావుతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


తుంగతుర్తిలో సాంస్కృతిక నృత్యాలతో సభకు వస్తున్న కళాకారులు


జాజిరెడ్డిగూడెంలో లక్ష్మీరాఘవరావు కళ్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు